
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY
భద్రాద్రి కొత్తగూడెం
BHADRADRI KOTHAGUDEM
ఆదివారం, 28 ఏప్రిల్ 2024





	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	43.8	25.4
భద్రాద్రి	44	26

'కమలం' దూకుడు



నియోజకవర్గ వ్యాప్తంగా జోరుగా ప్రచారం

- నేతల సమన్వయంతో ముందుకు సాగుతున్న అభ్యర్థి వినోద్‌రావు
- ఇప్పటికే రోడ్ షో నిర్వహించిన కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్
- రేపు కొత్తగూడేనికి జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాక
- త్వరలో ప్రధాని మోదీ సైతం వచ్చే అవకాశం
- ఎవరి ఓటు బ్యాంకుకు గండి పడుతుందోనని కాంగ్రెస్, బీఆర్ఎస్ కలవరం

ఖమ్మం లోక్‌సభ పోరులో బీజేపీ దూకుడు పెంచింది. నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో పకడ్బందీగా ప్రచారం నిర్వహిస్తోంది. తొలిసారిగా బరిలోకి దిగిన తాండ్ర వినోద్‌రావు పార్టీలోని నేతలందరిని కలుపుకొంటూ ఊరూరా చుట్టేస్తున్నారు. అందరికంటే ముందు వినోద్‌రావు ఈ నెల 19న నామినేషన్ దాఖలు చేయగా, అదేరోజు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఖమ్మంలో రోడ్‌షో నిర్వహించారు. అలాగే పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఈ నెల 29న కొత్తగూడెంలో బహిరంగసభకు హాజరుకానున్నారు. ప్రచారం ముగిసేలోపు ప్రధాని మోదీ కూడా రానున్నట్టు తెలుస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మంలో బీజేపీకి 20,327ఓట్లు రాగా, ఈ సారి మోదీ నినాదంతో బీజేపీ నేతలు ఓటు బ్యాంకును పెంచుకునే వ్యూహాల్లో వున్నారు. బీజేపీ జోరు పెరగడంతో నియోజకవర్గంలో ఏ ప్రధాన పార్టీ ఓటుబ్యాంకుకు గండి పడుతుందనేది చర్చనీయాంశంగా మారింది. ఈ సారి బీజేపీకి టీడీపీ కూడా మద్దతు పలుకుతుండటం ఆసక్తి రేపుతోంది.

ఖమ్మం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు తోడుగా ఈసారి బీజేపీ కూడా పోటాపోటీగా ప్రచారం సాగిస్తోంది. దీంతో ఎవరి ఓట్లకు గండి పడుతోందనని ప్రధాన పార్టీల్లో ఆందోళన నెలకొంది. ఖమ్మంలో ఇప్పటివరకు లోక్‌సభ ఎన్నికల్లో ద్విముఖ పోరు సాగుతూ వస్తుండగా, బీజేపీకి స్వల్ప ఓటుబ్యాంకు మాత్రమే దక్కుకుంటూ వస్తోంది. ఈసారి గతానికంటే భిన్నంగా బీజేపీ ప్రచారపర్వంలో ప్రధాన పార్టీలతో పోటీపడుతోంది. అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు గత 20రోజులుగా లోక్‌సభ నియోజకవర్గాన్ని చుడుతూ జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఖమ్మం భవిత, భద్రత, సుస్థిరత పేరుతో లోక్‌సభ నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానంటూ హామీ ఇస్తున్నారు. పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకులను ప్రచారంలో దించుతున్నారు. ఇప్పటికే కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్.. వినోద్‌రావు నామినేషన్ రోజున ఖమ్మంలో రోడ్ షో నిర్వహించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా, ప్రధాని మోదీతోపాటు పలువురు కేంద్ర మంత్రులు ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించేందుకు పార్టీ కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి పథకాలు, పదేళ్లగా నరేంద్రమోదీ చేసిన కృషితోపాటు తమను లోక్‌సభ నియోజకర్గంలో గెలిపిస్తే యువతకు ఉపాధి అవకాశాలతోపాటు జాతీయ విద్యాసంస్థలు నెలకొల్పుతామని, పరిశ్రమలు స్థాపిస్తామని, ఎన్ఐటీ, ఐఐటీలు ఏర్పాటు చేస్తామని కొత్తగూడెంలో మైనింగ్ యూనివర్శిటీ, కొవ్వూరు-భద్రాచలం రైల్వే పనులు వేగవంతం చేపిస్తామని, సింగరేణి కార్మికుల ఇళ్ల నిర్మాణం, గిరిజన యువతకు స్కిల్‌సెంటర్, ఖమ్మం జిల్లాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని హామీలిస్తున్నారు. కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు, భద్రాచలం రామాలయ అభివృద్ధి, జాతీయ వ్యవసాయ పథకాలతో రైతులకు ప్రోత్సాహం కల్పిస్తామని హామీలు ఇస్తున్నారు.

దీనికి తోడు బీజేపీ అభ్యర్థి వినోద్ రావుతోపాటు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, రంగా కిరణ్, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ జాతీయ నాయకుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, నంబూరి రామలింగేశ్వరరావు తదితరులు బీజేపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. 2014లో బీజేపీ ఖమ్మం, మహబూబాబాద్‌లో టీడీపీకి లోక్‌సభ ఎన్నికల్లో మద్దతు ఇచ్చింది. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా ఖమ్మం నుంచి పోటీచేసిన దేవకి వాసుదేవరావుకు 20,327 ఓట్లు వచ్చాయి. మహబాద్ నుంచి పోటీచేసిన జాటోత్ హుస్సేన్ 25,487 ఓట్లు వచ్చాయి. ఇటు ఖమ్మం, అటు మహబాద్ నియోజకవర్గాల్లో నామమాత్రంగానే ఓటు బ్యాంకు సాధించింది. ఈసారి ఖమ్మంలో తాండ్ర వినోద్‌రావు బరిలో ఉండగా, మహబూబాబాద్‌లో బీజేపీ అభ్యర్థిగా మాజీ ఎంపీ సీతారాంనాయక్ బరిలో ఉన్నారు. వినోద్‌రావు బీజేపీ అనుబంధ సేవాసంస్థల్లోనూ, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వస్తున్నారు. ప్రత్యేక చారిటబుల్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తొలిసారి ఎన్నికల బరిలో నిలిచిన వినోద్‌రావు విదేశాల్లో ఉన్నత చదవులు చదివారు. పలు వ్యాపార, నిర్మాణ సంస్థలు నిర్వహిస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ములకలపల్లి మండలం తిమ్మంపేట ఆయన స్వగ్రామం. దీంతో ఇటు ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో మైదానప్రాంతంతోపాటు ఏజెన్సీ గ్రామాల్లోనూ ప్రచారంలో పాలుపంచుకుంటూ బీజేపీ విధానాలను, కేంద్ర అభివృద్ధి సంక్షేమ పథకాలను గెలిపించాలని కోరుతున్నారు. బీజేపీ ఈసారి వ్యూహాత్మకంగా బరిలో ఉండడంతో ఇటు కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు తమ ఓటుబ్యాంకు బీజేపీకి వెళ్లకుండా తాము కూడా రామాలయాలు గ్రామాల్లో నిర్మించామని, రాముడి అందరి వాడని చెబుతూ తమ లౌకిక విధానాన్ని వివరిస్తున్నారు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, జనసేన కూటమి

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, జనసేన కూటమిగా ఉమ్మడిజిల్లాలో పనిచేశాయి.పది నియోజకవర్గాల్లో 23,822 ఓట్లు సాధించారు. పొత్తులో సమన్వయం కుదరకపోవటం, చివరిలో అభ్యర్థులు ఖరారు కావటం పొత్తులో గందరగోళం నెలకొంది. బీజేపీ పోటీచేసిన 7నియోజకవర్గాల్లో 15,556 ఓట్లు లభించాయి. జనసేన పోటీచేసిన 3 నియోజకవర్గాల్లో 8266 ఓట్లు వచ్చాయి. బీజేపీ పోటీచేసిన పాలేరులో 1815, వైరాలో 2712, మధిరలో 2021, సత్తుపల్లిలో 1882, పినపాకలో 2627, ఇల్లెందులో 2568, భద్రాచలంలో 1931 ఓట్లు రాగా జనసేనకు ఖమ్మంలో 4040, కొత్తగూడెంలో 1945, అశ్వారావుపేటలో 2281 ఓట్లు లభించాయి.

టీడీపీపై బీజేపీ ఆశలు

ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏలో తెలుగుదేశం, జనసేన చేరటంతో ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో టీడీపీ సానుభూతి ఓటుబ్యాంక్‌పై బీజేపీ ఆశలు పెట్టుకుంది. గత ఎన్నికల్లో టీడీపీ జిల్లాలో కాంగ్రెస్ విజయానికి కృషి చేయటంతో కాంగ్రెస్‌కు ఆయా నియోజకవర్గాల్లో భారీ ఆధిక్యతలు లభించాయి. ప్రస్తుతం టీడీపీ స్తబ్దతగా ఉంది. బీజేపీ త్వరలో మోదీ, చంద్రబాబులతో ఖమ్మంలో ఎన్డీఏ భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసి టీడీపీ ఓటు బ్యాంక్ బీజేపీ పొందేందుకు ప్రయత్నిస్తోంది. టీడీపీ ఓటు బ్యాంక్‌పైనా బీజేపీ అధికంగానే ఆశలు పెట్టుకుంది.

రేపు కొత్తగూడెంలో బీజేపీ బహిరంగ సభ

జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాక 6

గెలిపించే బాధ్యత మీది..
అభివృద్ధి బాధ్యత మాది

- ఇందిరమ్మ రాజ్యం స్ఫూర్తితో కేంద్రంలో 'ఇండియా' పాలన
- ఖమ్మం, మహబూబాబాద్‌లో భారీ మెజారిటీలు రావాలి
- లోకసభ ఎన్నికల్లో గెలుపుకాదు.. మెజారిటీయే ముఖ్యం
- సమావేశంలో మంత్రులు తుమ్మల, పొంగులేటి



ఖమ్మంలో పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించే బాధ్యత ప్రజలు, కార్యకర్తలదైతే.. ఉమ్మడి జిల్లాను అభివృద్ధి చేసే బాధ్యత తమది వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో నిరంకుశ బీఆర్ఎస్‌ను ఎలా మట్టికరిపించి కాంగ్రెస్‌ను గెలిపించుకుని ఇందిరమ్మ రాజ్యాన్ని స్థాపించుకున్నామో అదే స్ఫూర్తితో కేంద్రంలో 'ఇండియా' కూటమి పాలన తెచ్చుకునేందుకు ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించేందుకు కాంగ్రెస్, కమ్యూనిస్టు పార్టీల కార్యకర్తలు సమిష్టిగా కృషిచేయాలన్నారు. ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రఘురాంరెడ్డి విజయాన్ని కోరుతూ శనివారం ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్‌లో ఖమ్మం నియోజకవర్గస్థాయి కాంగ్రెస్ కార్యకర్తలు నాయకులు విస్తృత సమావేశం నిర్వహించారు.

ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులమున్నామని, రాబోయే రోజుల్లో గోదావరి జలాలను ఉమ్మడి జిల్లాలో పారించి సస్యశ్యామలం చేసే బాధ్యత తమదేన్నారు. నిజాం నిరంకుశ పాలనను ఎదిరించిన పోరాట యోధులకు, ఆదర్శవంతమైన రైతులకు నిలయమైన ఈ జిల్లాను మరింతగా అభివృద్ధి చేసే బాధ్యత తమదేనన్నారు. కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించే బాధ్యత ప్రజలదీ, కార్యకర్తలదేనన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ స్థానాల నుంచి రఘురాంరెడ్డి, బలరాంనాయక్ గెలుపు ద్వారా విభజన హామీలతోపాటు జాతీయ రహదారులు, రైల్వేలైన్లు, ఖమ్మం నగర ఆధునీకరణకు భారీగా నిధులు తెచ్చుకునే అవకాశం ఉంటుందన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో ప్రభుత్వ స్థలాలు పేదలకే చెందాలన్నారు. దేశంలో ఏ ప్రధాని మాట్లాడని విధంగా ప్రధాని మోదీ ప్రజాస్వామ్య

(మిగతా 7వ పేజీలో...)



బీఆర్ఎస్, బీజేపీలను బొంద పెడతాం

కొత్తగూడెంలో మంత్రి పొంగులేటి 7

తెలంగాణ ఉద్యమం..
మహోజ్వల చరిత్ర

- పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులు గెలవాలి
- బీఆర్ఎస్ నేతలు నామా, వద్దిరాజు, పువ్వాడ, తాతా మధు
- ఇరుజిల్లాల్లో ఘనంగా ఆవిర్భావ వేడుకలు

ఖమ్మం కార్పొరేషన్, ఏప్రిల్ 27: తెలంగాణ ఉద్యమం మరపురాని మహోజ్వల చరిత్ర అని, తెలంగాణ సాధించిన కేసీఆర్ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతారని బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంటరీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ 23వ ఆవిర్భావం సందర్భంగా శనివారం బీఆర్ఎస్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ గులాబీజెండా ఎగురవేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో నామా మాట్లాడుతూ పార్లమెంట్‌లో తెలంగాణ గళం వినిపించాలంటే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాంగ్రెస్, బీజేపీ, ఐఎంఐ ఎంపీలు పార్లమెంట్‌లో తెలంగాణ సమస్యలపై మాట్లాడరని, కేవలం బీఆర్ఎస్ ఎంపీలు మాత్రమే తెలంగాణ గళం వినిపిస్తారన్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ టూరిస్ట్‌ల్లాగా జిల్లాకు వచ్చేవారికి ఓటు వేస్తే పార్లమెంటులో వారి సంఖ్య పెరగటమే కాని జిల్లాకు ఎటువంటి ప్రయోజనం ఉండదన్నారు. స్థానికుడైన నామాను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్‌కు ఖమ్మంసీటును కానుకగా ఇవ్వాలన్నారు. స్థానికుడైన నామాను గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని కోరారు. ఎమ్మెల్సీ తాతా మదుసూదన్ మాట్లాడుతూ నామా నామినేషన్ తిరస్కరించాలని కాంగ్రెస్ నేతలు ప్రయత్నించటం సిగ్గుచేటన్నారు. ఓటమి భయంతో కాంగ్రెస్ జిమ్మిక్కులు చేస్తున్నదన్నారు. విలేకరుల సమావేశంలో నాయకులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, ఉద్యమకారులు బొమ్మెర రామ్మూర్తి, పగడాల నరేందర్, డోకుపర్తి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెంలో తెలంగాణ తల్లి విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో....

చుంచుపల్లి(కొత్తగూడెం): కొత్తగూడెంలో శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పార్టీ జెండా ఎగురవేసి తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. జిల్లా కేంద్రంలో కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కొత్తగూడెం, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, బాణోత్ హరిప్రియ, తెలంగాణ ఉద్యమకారులు, గ్రంథాలయ మాజీ ఛైర్మన్ దిండిగల రాజేందర్, కొత్తగూడెం మునిసిపల్ ఛైర్‌పర్సన్ కాపు సీతామహాలక్ష్మీ, నాయకులు మోరే భాస్కర్, అనుదీప్, కౌన్సిలర్ ధర్మరాజు, పార్టీ సోషల్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడు కర్నె మురళి తదితరులు పాల్గొన్నారు.



కోనేరు చిన్నిని కాంగ్రెస్ పార్టీలోకి కండువా కప్పి ఆహ్వానిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

భద్రాద్రి జిల్లాలో
బీఆర్ఎస్‌కు షాక్

- కాంగ్రెస్ గూటికి కోనేరు చిన్ని, జేవీఎస్ చౌదరి, జడ్పీటీసీ బరపాటి వాసు
- సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిక

కొత్తగూడెం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి బిగ్‌షాక్ తగిలింది. బీఆర్ఎస్ పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తున్న మాజీ మంత్రి కోనేరు నాగేశ్వరరావు తనయుడు కోనేరు సత్యనారాయణ(చిన్ని), జేవీఎస్ చౌదరి, పాల్వంచ జడ్పీటీసీ బరపాటి వాసుదేవరావు, కోనేరు పూర్ణచంద్రరావు, సంతోష్ గౌడ్ తదితరులు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో నాయకులంతా కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయా నాయకులు మాట్లాడుతూ ఖమ్మంలో కాంగ్రెస్ తరఫున పోటీచేస్తున్న రామసహాయం రఘురాంరెడ్డి విజయం కోసం కృషిచేస్తామని, కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించి, పార్టీని బలోపేతం చేయాలని కోనేరు తదితరులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

తండ్రికి అండగా టీడీపీలో..

కోనేరు సత్యనారాయణ గతంలో టీడీపీలో ఉండి కొత్తగూడెం నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేశారు. అప్పట్లో తన తండ్రి మాజీమంత్రి దివంగత నేత కోనేరు నాగేశ్వరరావుకు అండదండగా ఉంటూ గెలుపు కోసం కృషిచేశారు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ పార్టీని బలోపేతం చేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి కూడా కృషిచేశారు. జేవీఎస్‌చౌదరి, కోనేరు పూర్ణచంద్రరావు, బరపాటి వాసులు సైతం టీడీపీలో చురుకైన పాత్ర పోషించారు. 2018అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో టీడీపీ పోటీలో లేకపోవడంతో కోనేరు చిన్ని బీజేపీలో చేరారు. ఆ తర్వాత బీజేపీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడిగా కొనసాగారు. మారిన రాజకీయ పరిస్థితుల దృష్ట్యా 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు కోనేరు చిన్ని బీజేపీకి గుడ్‌బై చెప్పి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అయితే తాజా రాజకీయ సమీకరణల నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల ముందే చిన్నితో పాటు ఇతర నాయకులు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరందరిని సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

రేపు కేసీఆర్ బస్సుయాత్ర

- సాయంత్రం ఖమ్మం జడ్పీ సెంటర్‌లో సభ
- ఎల్లుండి తల్లాడ, కొత్తగూడెంలో యాత్ర
- నామా గెలుపు కోసం ప్రచారం



ఖమ్మం కార్పొరేషన్, ఏప్రిల్ 27: బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ బస్సుయాత్ర సోమవారం సాయంత్రం 5గంటలకు ఖమ్మంలో ఉంటుందని మాజీమంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. బస్సుయాత్ర మయూరిసెంటర్ నుంచి జడ్పీసెంటర్ వరకు సాగుతుందన్నారు. జడ్పీసెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద సభ ఉంటుందని పేర్కొన్నారు. కేసీఆర్ వరంగల్ జిల్లా నుంచి సోమవారం సాయంత్రం 6గంటలకు ఖమ్మం వస్తారు. ఖమ్మంలో రోడ్‌షో, సభ నిర్వహించిన అనంతరం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ నివాసంలో బస చేస్తారు. మంగళవారం సాయంత్రం అక్కడినుంచి బయలుదేరి 5:30గంటలకు తల్లాడలో రోడ్‌షో నిర్వహిస్తారు. అనంతరం 6:30గంటలకు కొత్తగూడెం చేరుకొని, అక్కడ రోడ్‌షో నిర్వహించి, రాత్రి బసచేస్తారు. బుధవారం సాయంత్రం మహబూబాబాద్ వెళతారు. కాగా కేసీఆర్ బస్సుయాత్ర విజయవంతం కోసం పువ్వాడ శనివారం మమత ఆస్పత్రి ప్రాంగణంలోని తన నివాసంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లతో, ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సుయాత్రను జయప్రదం చేసేందుకు ప్రతీ ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు కర్నాటి కృష్ణ, షేక్ మక్బూల్, నాయకులు పాల్గొన్నారు.



కరకట్ట పనులు జరుగుతున్న దృశ్యం

7

భద్రాద్రి కరకట్ట పనులు ముమ్మరం

- మంత్రి తుమ్మల చొరవతో వేగంగా జరుగుతున్న పనులు
- వరదల సీజన్ నాటికి పూర్తి చేసే పనిలో అధికారులు

ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు 6

ఎన్నికల పరిశీలకుడు సంజయ్

గోలుగొండ నుంచి మానుకోట వరకు..

నాలుగుసార్లు మారిన పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రం 6

రూ.63 లక్షల నగదు, బంగారం సీజ్

ఖమ్మం రూరల్ మండలం వెంకటగిరి క్రాస్‌రోడ్‌లో పోలీసుల తనిఖీలు 6



స్వామి వారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసార్చన

భద్రాచలం, ఏప్రిల్ 27 : భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామికి శనివారం ఆర్జిత సేవలో భాగంగా అంతరాలయంలో స్వర్ణ తులసార్చన సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే స్వామివారికి నిత్యకల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

- నాలుగుసార్లు మారిన పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రం
- ఇద్దరు ఎంపీలకు దక్కిన కేంద్ర మంత్రి పదవులు
- 1952లో ద్విసభ్య స్థానంగా ప్రాతినిధ్యం
- 1957లో తొలుత జనరల్ సెగ్మెంట్‌గా ఆవిర్భావం
- 2009లో ఎస్టీ నియోజకర్గంగా మార్పు
- హెలీకాప్టర్ నియోజకవర్గంగా 'భద్రాచలం' గుర్తింపు
- ఇదీ మహబూబాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ ప్రస్థానం



గోలుగొండ నుంచి మానుకోట వరకు..

అటు మన్యం, ఇటు మైదాన ప్రాంతాలు, మరోవైపు బొగ్గు గనులు, పరిశ్రామిక ప్రాంతాల కలయికగా ఉన్న మానుకోట పార్లమెంట్ నియోజకవర్గానికి ఘన చరిత్రే ఉంది. నాలుగు పర్యాయాలు సెగ్మెంట్ ముఖ్య కేంద్రం మార్పుతో పాటు ఇక్కడ నుంచి గెలిచిన వారిలో ఇద్దరు కేంద్ర మంత్రులు పనిచేసే అవకాశం దక్కించుకున్నారు. వారిలో ఒక మహిళ ఉండటం విశేషం.

భద్రాచలం, ఏప్రిల్ 27: మహబూబాద్ లోక్‌సభ స్థానానికి ఎంతో ఘన చరిత్ర ఉంది. ఈ నియోజకవర్గం 1957లో తొలుత జనరల్ పార్లమెంటు నియోజకవర్గంగా ఆవిర్భవించగా అనంతరం 2009లో ఎస్టీ నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. ఆ సమయంలో గతంలో భద్రాచలం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఉన్న పలు అసెంబ్లీ స్థానాలను మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో చేర్చారు. కాగా అప్పటి వరకు విస్తీర్ణపరంగా దేశంలోనే హెలికాప్టర్ నియోజకవర్గంగా భద్రాచలం పేరుగాంచింది. భద్రాచలం పార్లమెంటు నియోజకవర్గంగా ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎంపీగా ఎన్నికైన కర్రెద్దుల కమలకుమారి కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 2009లో మహబూబాబాద్ పార్లమెంటు ఎస్టీ నియోజకవర్గంగా ఏర్పడిన అనంతరం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫునపోటీ చేసి గెలిచిన పోరిక బలరాంనాయక్ కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 62 సంవత్సరాల పార్లమెంటు చరిత్రలో వీరిద్దరే కేంద్ర మంత్రులుగా ఇప్పటి వరకు పని చేయడం విశేషం. కాగా మహబూబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో మహబూబాద్, ములుగు, ఇల్లందు, పినపాక, భద్రాచలం, నర్సంపేట, డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి.

తొలుత గోలుగొండ... ద్విసభ్య సభ్యులుగా.!

భద్రాచలం లోక్‌సభ స్థానం ఆవిర్భవించక ముందు అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1952లోజరిగిన మొదటి సాధారణ ఎన్నికల్లో గొలుగొండ లోక్‌సభకు ఎన్నికలు నిర్వహించారు. ఆ సమయంలో గోలుగొండ స్థానానికి ఇద్దరు సభ్యులుండేవారు. ఒకరు షెడ్యూల్ తెగలకు ప్రాతినిధ్యం వహించగా మరొకరు షెడ్యూల్ కులాలకు ప్రాతినిధ్యం వహించారు. కేంద్ర, రాష్ట్ర శాసనసభల్లో ఇద్దరు సభ్యులు కలిగిన లోక్‌సభ స్థానం ఏర్పాటు ఈ ప్రాంతంలో ఉన్న షెడ్యూల్ తెగలు, షెడ్యూల్ కులాల వారికి తగిన ప్రాధాన్యం ఇచ్చే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసారు. ఈ పద్ధతి ప్రకారం ప్రతీ ఓటరుకు రెండు బ్యాలెట్ పత్రాలిచ్చేవారు. కాగా 1952లో తొలిసారి, 1957లో రెండోసారి లోక్‌సభ ఎన్నికలు నిర్వహించగా అవి గోలుగొండ లోక్‌సభ నియోజకవర్గంగా నిర్వహించారు.

1962లో నర్సీపట్నం లోక్‌సభ స్థానంగా

1962లో మూడో సాధారణ ఎన్నికల నాటికి ఈ ప్రాంతం గోలుగొండ పార్లమెంటు నియోజకవర్గం నుంచి నర్సీపట్నం పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోకి వచ్చింది. 1961వ సంవత్సరంలో ప్రత్యేక చట్టం ద్వారా ద్విసభ్య నియోజకవర్గ బిల్లు రద్దు కావడంతో నర్సీపట్నం లోక్‌సభ నియోజకవర్గం ఏక సభ్య స్థానంగా ఏర్పడింది.



కమలకుమారి, బలరాంనాయక్

1967లో ఎస్టీ నియోజకవర్గం ఆవిర్భావం

లోక్‌సభకు నాల్గోసారి ఎన్నికలు జరిగే సమయానికి 1967వ సంవత్సరంలో నర్సీపట్నం పార్లమెంటు నియోజకవర్గం పునర్నిర్మించే భాగంలో భద్రాచలం ఎస్టీ నియోజకవర్గం ఆవిర్భవించింది. ఈ నియోజకవర్గం పరిధి ఉమ్మడి ఖమ్మం జిల్లా, ఉభయగోదావరి, విశాఖపట్నం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో ఏర్పాటైంది. దేశంలోనే అత్యంత విస్తీర్ణంతో లోక్‌సభ నియోజకవర్గంగా భద్రాచలం పేరుగాంచింది. నాడు ఈ నియోజకవర్గం హెలీకాప్టర్ నియోజకవర్గంగా పేర్కొనేవారు.

2009లో మహబూబాద్‌లో ఏర్పాటు

1957లో మహబూబాబాద్ లోక్‌సభ స్థానం జనరల్ కేటగిరీలో కేటాయించబడింది. 1957,1962లో సాధారణ ఎన్నికలు, 1965లో ఉప ఎన్నిక జరిగిన అనంతరం 2009లో మహబూబాద్ ఎస్టీ నియోజకవర్గం ఏర్పాటు చేశారు. అప్పటి వరకు ఉన్న భద్రాచలం లోక్‌సభ స్థానాన్ని రద్దు చేశారు. ఆ నియోజకవర్గ పరిధిలో ఉన్న భద్రాచలం, పినపాక అసెంబ్లీ నియోజకవర్గాలను మహబూబాద్ ఎస్టీ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోకి తీసుకొచ్చారు.

ఆదివాసీల్లో వెల్లువెత్తుతున్న ఆవేదన

మహబూబాబాద్ లోక్‌సభస్థానం 2009లో ఆవిర్భవించిన నాటి నుంచి ఆదివాసీలకు ప్రాతినిధ్యం దక్కకపోవడం పట్ల ఆదివాసీ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2009, 2014, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు ఆదివాసీ సామాజిక వర్గాన్ని విస్మరించాయని వారు విమర్శిస్తున్నారు. తాజాగా జరుగుతున్న ఎన్నికల్లో సైతం ప్రధాన రాజకీయ పక్షాలు అదే కోవలో ఆదివాసీ సామాజిక వర్గానికి రిక్తహస్తం చూపడం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికల నేపథ్యంలో విస్తృత తనిఖీలు

» పోలీస్ కమిషనర్ సునిల్‌దత్

ఖమ్మం క్రైం, ఏప్రిల్27: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కమిషనరేట్ వ్యాప్తంగా జిల్లా పోలీసు యంత్రాంగం విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నట్లు సీపీ సునిల్‌దత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఒక్కరోజే రూ.24లక్షల నగదు, రూ.20లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, రూ.18వేల విలువచేసే అక్రమ మద్యాన్ని సీజ్ చేశామని తెలిపారు. ఎన్నికల కోడ్ వచ్చిన నాటి నుంచి గురువారం వరకు ఎస్సెస్టీ అండ్ పోలీసు విభాగం ఆధ్వర్యంలో రూ.1,00,59,130 నగదు సీజ్ చేశామని తెలిపారు. ఎఫ్ఎస్‌టీ, పోలీసు అండ్ ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో రూ.46,36,883 అక్రమ మద్యాన్ని, రూ.11,47,000 విలువ చేసే 44 కిలోల గంజాయిని పోలీసు, ఎక్సైజ్ తనిఖీల్లో సీజ్ చేశామన్నారు. పెద్దమొత్తంలో నగదు, ఆభరణాలు వెంట తీసుకెళ్లాలంటే తప్పనిసరిగా సంబంధిత పత్రాలుండాలని తెలిపారు.

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వాహనం తనిఖీ

ఆళ్లపల్లి, ఏప్రిల్ 27: పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు వాహనాన్ని శనివారం ఆళ్లపల్లి పోలీసులు తనిఖీ చేశారు. మండలంలోని పలు వివాహ కార్యక్రమాలకు పాయం వెంకటేశ్వర్లు హజర్ అవుతున్న క్రమంలో అనంతోగులో ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్‌పోస్టు వద్ద ఆళ్లపల్లి ఎస్ఐ రతీష్, హెడ్‌కానిస్టేబుల్ రాజేశ్వరావు, కానిస్టేబుల్ శ్రీనివాస్, టీఎస్ఎస్‌పీ సిబ్బంది ఆయన వాహనాన్ని తనిఖీ చేశారు. ఎమ్మెల్యే పాయం వాహనం దిగి పోలీసులకు సహకరించారు.



వాహనాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం

రూ.63లక్షల నగదు, బంగారం సీజ్

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 27: మండల పరిధిలోని వెంకటగిరి క్రాస్‌రోడ్డులో పోలీసులు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద శనివారం సుమారు రూ.63 లక్షల నగదు, 275 గ్రాముల బంగారాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఏపీలోని జగ్గయ్యపేటకి చెందిన పవన్ కారులో హైదరాబాద్ వెళుతున్నారు. ఆ కారును వెంకటగిరి క్రాస్‌రోడ్డులో చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీ చేయగా రూ. 20,55,000ల నగదు, 275 గ్రాముల బంగారం ఉన్నట్లు గుర్తించారు. కోదాడకు వెళుతున్న ఆర్టీసీ బస్సులో కొత్తగూడేనికి చెందిన రజనీకాంత్ వద్ద రూ.42,86,520లు ఉన్నట్లు గుర్తించారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో ఆ నగదును పోలీసులు సీజ్ చేశారు. బంగారాన్ని ఎన్నికల అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ పుష్కుమార్ తెలిపారు.



పోలీసులు సీజ్ చేసిన నగదు

దమ్మపేట: అల్లిపల్లి బోర్డర్ చెక్‌పోస్టు వద్ద ఏలూరుజిల్లా చింతలపూడి మండలం నుంచి ఇల్లెందు వైపు వెళుతున్న వ్యానులో రూ.56వేల నగదు, ముష్టిబండ గ్రామంలో 40 మద్యం క్వార్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.



మాట్లడుతున్న తాండ్ర వినోద్‌రావు

ఖమ్మంపై మోదీ ప్రత్యేక దృష్టి

» బీజేపీ ఎంపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు

ఖమ్మం బైపాస్‌రోడ్/ కార్పొరేషన్, ఏప్రిల్ 27: పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన ఖమ్మంమీద ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రత్యేకదృష్టి కేంద్రీకరించారని, వారి ద్వారా ఇక్కడి అభివృద్ధికి, ఉద్యోగాల కల్పనకు ఈ గడ్డ బిడ్డగా కృషిచేస్తానని ఖమ్మం పార్లమెంటు బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు అన్నారు. ఖమ్మంలో శనివారం రాత్రి జరిగిన రోడ్‌షోలో తాండ్ర వినోద్‌రావు మాట్లాడారు. తాను నామినేషన్ పేపర్లు సమర్పించిన రోజు రక్షణశాఖామంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఖమ్మానికి పంపారని, 29న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డాను కొత్తగూడెం పంపుతున్నారని, ప్రజల దీవెనలు ఉంటే స్వయంగా మోదీనే వస్తారని అన్నారు. సరైన ఎంపీ లేకపోవటం వల్ల ఈ ప్రాంతంలో ఒక్క ఫ్యాక్టరీగానీ, చెప్పుకోదగ్గ విద్యాసంస్థగానీ, వైద్యశాల గాని రాలేదని అన్నారు.

ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వంలోనే బీసీలకు న్యాయం జరగుతుందని బీజేపీ ఖమ్మం పార్లమెంటరీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు పేర్కొన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వీరూగౌడ్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బీసీ సన్నాహక సదస్సులో ఆయన మాట్లాడారు. బీసీలను ఎంతో అభివృద్ధి చేసిన ప్రధాని మోదీకి ఖమ్మం పార్లమెంట్ సీటును గెలిపించి కానుకగా ఇవ్వాలని కోరారు. . ఈ సమావేశంలో మాజీ మంత్రి విజయరామారావు, ఓబీసీ రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్, భానుప్రకాష్, సత్యనారాయణ, జ్వాలా నర్సింహారావు, మాధవ్, సరస్వతి, త్రీటౌన్ అధ్యక్షుడు కె.లక్ష్మీనారాయణ, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదుల వీరభద్రం, జంగిలి రమణ, అంకతి పాపారావు, రవీందర్, పమ్మి అనిత, శాసనాల సాయిరాం, బీకం నాయక్ పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు చర్యలు

ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ సంజయ్ జీ కోల్టే, కలెక్టర్ వీపీ గౌతమ్

సత్తుపల్లి/ వైరా/ అశ్వారావుపేట/ కొత్తగూడెం, ఏప్రిల్27: ఓటర్లకు అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహించి ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ సంజయ్ జీ కోల్టే, కలెక్టర్ వీపీ గౌతమ్ వివరించారు. శనివారం సత్తుపల్లి మండలంలోని కిష్టారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం, సత్తుపల్లి పట్టణంలోని జ్యోతినిలయం ఉన్నత పాఠశాలలో ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్, గంగారంలోని అంతరాష్ట్ర చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిష్టారం పాఠశాలలో పోలింగ్ కేంద్రాలలో వసతులు, మరుగుదొడ్లు, విద్యుత్ లైట్లు, ఇతర సదుపాయాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. జ్యోతినిలయం స్కూల్‌లో రిసెప్షన్ సెంటర్ గదులు, భోజనం, వాహనాల పార్కింగ్ స్థలం, ఈవీఎం స్ట్రాంగ్ రూమ్, కమీషనింగ్ రూమ్‌లను తనిఖీ చేసి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. అనంతతరం వారు వైరాలోని ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలించారు. వైరా అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఈవీఎంలను వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల గదుల్లో భద్రపరిచారు. ఈ పాఠశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ను అధికారులు పరిశీలించారు. అశ్వారావుపేట, దమ్మపేట మండలాలలో పర్యటించిన సందర్భంగా అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎం స్ట్రాంగ్ రూమ్, కమీషనింగ్ రూమ్, డిస్ట్రిబ్యూషన్ స్థలాన్ని పరిశీలించారు. భ ద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. చెక్‌పోస్టును పరిశీలించి ఎన్నికలు పకడ్బందీగా జరిగేలా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండలపల్లిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును పరిశీలించి రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు.



కిష్టారంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరిశీలకులు



అశ్వారావుపేటలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు తనిఖీ

మద్యం, నగదు, ఇతర నిషేధిత పదార్థాలు, సామగ్రి ఖమ్మం జిల్లాలోకి రాకుండా సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏర్పాటు చేసిన గంగారం అంతరాష్ట్ర చెక్‌పోస్టును తనిఖీ చేశారు. అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇస్తూ 24/7 అన్ని వాహనాలను పూర్తిగా, క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. గిఫ్ట్ వస్తువులు, పరికరాలు, బంగారం, వెండి వస్తువులు తరలించే సమయంలో కచ్చితంగా వాటికి రశీదులు ఉంచుకోవాలని సూచించారు.

మార్గదర్శకాల మేరకే విధులు

ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకే ఎన్నికల విధులు నిర్వహించాలని పరిశీలకులు డాక్టర్ సంజయ్ జి. కోల్టే అన్నారు. ఐడీఓసీలోని సమావేశ మందిరంలో పోలీస్ పరిశీలకులు చరణ్‌జిత్ సింగ్, వ్యయ పరిశీలకులు శంకర్‌ఆనంద్ మిశ్రా, రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ గౌతమ్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక అలా, ఎస్పీ రోహిత్‌రాజ్‌లతో కలిసి సహాయ రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

కాంగ్రెస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలి

» మంత్రులు తుమ్మల, పొంగులేటి

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 27: లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రాఘురాం రెడ్డి ని భారీ మెజార్టీతో గెలిపించాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని టీసీవీ రెడ్డి ఫంక్షన్‌హాలులో పాలేరు నియోజకవర్గ కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంముఖ్య నాయకుల సమావేశం శనివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో 50 వేల ఓట్ల మెజార్టీ ఇచ్చారని, పార్లమెంట్ ఎన్నికల్లో అంతకు నాలుగురెట్లు మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు. ప్రస్తుతం తాము అనుభవిస్తున్న పదవులు ప్రజల చలువే అని అన్నారు.

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అధికార అహంకారంతో విర్రవీగిన బీఆర్ఎస్ పాలకులకు ఓటర్లు చెంపచెల్లుమనిపంచారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కూడా మళ్లీ ఇదే పునారావృతం అవుతుందన్నారు. మతోన్మాద బీజేపీ సర్కార్‌ను గద్దెదింపుతామని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి సంభాని, నియోజకవర్గ పరిశీలకుడు అశోక్‌గౌడ్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, నాయకులు రాయల నాగేశ్వరరావు, మద్దినేని స్వర్ణకుమారి, జడ్పీటీసీ బెల్లం శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, నరేశ్‌రెడ్డి, వెంకటరెడ్డి, జగదీష్, మల్లారెడ్డి, సీపీఎం, సీపీఐ నాయకులు మౌలానా, దండి సురేష్, బత్తినేని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఖమ్మం గెలుపుతో బీజేపీ చరిత్ర సృష్టించబోతోంది

» బీజేపీ జాతీయ నాయకుడు సుధాకర్‌రెడ్డి

ఖమ్మం కార్పొరేషన్, ఏప్రిల్ 27: ఖమ్మం పార్లమెంటరీ స్థానాన్ని గెలుచుకోవటం ద్వారా బీజేపీ దేశంలో చరిత్ర సృష్టించబోతున్నదని బీజేపీ జాతీయ నాయకులు, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా బీజేపీ కార్యాలయంలో బీజేపీ ఖమ్మం పార్లమెంటరీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావుతో కలిసి మాట్లాడుతూ ఢిల్లీలో తల్లి, కొడుకుల పాలన, తెలంగాణాలో కుటుంబపాలనతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ విశ్వాసం కోల్పోయిం దన్నారు. ఇక కాంగ్రెస్, బీఆర్ఎస్ ఆటలు సాగవని, బీజేపీవైపే ప్రజలు మొగ్గుచూపుతున్నదన్నారు. అభ్యర్థి తాండ్ర వినోదరావు గెలుపు జిల్లా అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. ముగ్గురు మంత్రులు వారి కుటుంబసభ్యులకు టిక్కెట్లు ఇప్పించుకోవటానికే తమ సమయాన్ని కేటాయించారని, ఇక ప్రజల సమస్యలు ఏం పట్టించుకుంటారని సుధాకర్ రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ ప్రజలతో మమేకమై ఉంటుందని, ఓడినా, గెలిచినా ప్రజల మధ్యేఉంటారన్నారు. బీజేపీ అభ్యర్థి వినోద్‌రావు మాట్లాడుతూ ఈ గడ్డపై పుట్టిన తనకు ఎక్కడకు వెళ్లినా ప్రజలు మద్దతు ఇస్తున్నారన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, గెంగూర వేంకటేశ్వర్లు, అంజయ్య, కార్పొరేటర్ డి. సత్యనారాయణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి..

భద్రాచలం, ఏప్రిల్ 27: సీఎం రేవంత్ రెడ్డి, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సమక్షంలో భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు శనివారం రాత్రి కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాదులో సీఎం ఇంటి వద్ద ఆయన సమక్షంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ గూడపాటి శ్రీనివాస్, తాళ్లపల్లి రమేష్ గౌడ్, కాకర్లపూడి కళ్యాణ్, యలమంచి నవ్యసాయి కృష్ణ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఇందులో తాళ్లపల్లి రమేష్ గౌడ్ గతంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడిగా పని చేసి ఇటీవల ఎన్నికల ముందు బీఆర్ఎస్ లో చేరారు. తాజాగా మళ్లీ తన సొంతపార్టీలోకి సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో వచ్చారు.

ఆటలాడుతూ.. ఓట్లడుగుతూ..

ఉత్సాహంగా కాంగ్రెస్ అభ్యర్థి రఘురాం రెడ్డి ఎన్నికల ప్రచారం

ఖమ్మం సంక్షేమవిభాగం, ఏప్రిల్ 27: తెల్లారుతూనే కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థి రఘురాంరెడ్డి ఓట్ల వేట ప్రారంభించారు. ఉదయాన్నే కనిపించిన అందర్ని పలకరిస్తూ ముందుకు సాగారు. వాకర్స్‌తో కలిసి వారి నడకలో నడక వేస్తూ తానే ఖమ్మం వాసినే అని పరిచయం చేసుకుంటూ ఓట్లు అడిగారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వర్లు, సుబ్బారావు, తదితరులను కలిసి తన గెలుపులో కీలకంగా సీపీఎం వ్యవహరించాలని కోరారు. తర్వాత షటిల్ కోర్టులో క్రీడాకారులతో పరిచయం చేసుకున్నారు. వారితో కలిసి ఉత్సాహంగా షటిల్ ఆడారు. తర్వాత క్రికెట్ మైదానంలో బ్యాటింగ్ చేస్తూ తన వెంట వచ్చిన కార్యకర్తలను ఉత్సాహ పరిచారు. టీడీపీ సెంటర్, ఇల్లెందు క్రాస్ రోడ్డు, వైరా రోడ్డులో టిఫెన్ సెంటర్, చిరు వ్యాపారులు, కూరగాయాల వ్యాపారుల వద్దకు వెళ్లి వారి బాగోగులు తెలుసుకున్నారు. టీ సెంటర్‌లో టీ పెడుతూ వ్యాపారులను తనకే ఓటు వేయాలని రఘురాంరెడ్డి కోరారు. తాను ఎంపీగా పోటీ చేసేది ప్రజలకు సేవా చేసేందుకే అని ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎండీ జావీద్, రాష్ట్ర విద్యావనరుల సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, నాయకులు ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, స్వర్ణకుమారి, చావా నారాయణరావు, మిక్కిలినేని నరేంద్ర, కొప్పుల చంద్రశేఖర్, మద్ది కిషోర్‌రెడ్డి, మలీదు నాగేశ్వరరావు, కేతినేని కృష్ణారావు కొత్తా సీతారాములు వెంటున్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఇటీవల తన నామినేషన్ ఉపసంహరించుకోవడంతో శనివారం రాయల నివాసానికి రఘురాంరెడ్డి ఉదయమే వెళ్లారు. తన గెలుపుకు కృషి చేయాలని రాయలను కోరారు.



షటిల్ ఆడుతున్న రఘురాం రెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న పొంగులేటి మాధురి

అన్నపురెడ్డిపల్లిలో పొంగులేటి కుటుంబ ప్రచారం

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 27: మండలంలోని పలుగ్రామాల్లో శనివారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పొంగులేటి సతీమణి మాధురితో పాటు పలువురు కుటుంబ సభ్యులు అక్కడి నాయకులతో కలిసి అన్నపురెడ్డిపల్లి, ఎర్రగుంట, రాజాపురం, పెంట్లం, అబ్బుగూడెం, మర్రిగూడెం తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలిసి ఖమ్మం పార్లమెంటు స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామసహాయం రఘురామిరెడ్డికి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పర్సా వెంకటేశ్వరావు, వేముల రమణ, నరసింహరావు, అహ్మద్, భీముడు, గఫార్ తదితురులు పాల్గొన్నారు.

పోలీస్ బలగాల ఫ్లాగ్‌మార్చ్

ఖమ్మం క్రైం, ఏప్రిల్ 27: పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్లకు భరోసా కల్పించడం కోసం నగరంలోని టు టౌన్ పరిధిలో కేంద్ర సాయుధ బలగాలతో శనివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా టూటౌన్ సీఐ బాలకృష్ణ మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలగకుండా పార్లమెంటు ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ముందస్తు ప్రణాళికతో క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో కట్టుదిట్టమైన బందోబస్తుకు అవసరమైన సన్నాహాలు చేపట్టినట్లు తెలిపారు. అందులో భాగంగానే సెంట్రల్ పోలీస్‌ఫోర్స్ స్థానిక పోలీసు సిబ్బంది కలిసి పోలీసు కవాతును నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రేపు కొత్తగూడెంలో బీజేపీ బహిరంగ సభ

» బీజేపీ జాతీయ నేత పొంగులేటి సుధాకర్‌రెడ్డి

లక్ష్మీదేవిపల్లి (కొత్తగూడెం), ఏప్రిల్ 27: ఖమ్మం లోక్‌సభ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావు గెలుపును కాంక్షిస్తూ సోమవారం కొత్తగూడెంలో జరగనున్న భారీ బహిరంగసభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరుకానున్నారని బీజేపీ జాతీయ నాయకుడు, తమిళనాడు, కర్ణాటక ఇన్‌చార్జ్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి తెలిపారు. కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో బహిరంగ సభ ఏర్పాట్లను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశ ప్రగతి ప్రధాని నరేంద్రమోదీతోనే సాధ్యమన్నారు. ప్రపంచ దేశాలు మోదీ నాయకత్వాన్ని సమర్థిస్తున్నాయని, గడిచిన పదేళ్ల బీజేపీ పాలనలో దేశం ఆర్థిక, సంక్షేమ రంగాల్లో గణనీయమైన ప్రగతిని సాధించిందని గుర్తుచేశారు. శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు ఇచ్చి గద్దెనెక్కిందని, కానీ ఆ గ్యారెంటీలను అమలుచేయడంలో ప్రజలను పూర్తిగా మోసం చేసిందని విమర్శించారు. ఇవన్నీ ప్రజలు గుర్తించారని, కాంగ్రెస్‌కు ఓటు వేసే పరిస్థితి లేదన్నారు. పరిపాలన, సంస్కృతికి మార్గదర్శకత్వాలు చూపిస్తూ ప్రపంచ మానవాళికి మార్గదర్శకుడైన శ్రీరాముడిని సైతం రాజకీయాల్లోకి లాగడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో కమ్యూనిస్టులు వారి స్వరూపాన్ని మార్చుకొని వ్యవహరిస్తున్నారన్నారు. ప్రకాశం మైదానంలో సోమవారం ఉదయం 11 గంటలకు జరిగే బహిరంగసభకు ప్రజలు భారీగా తరలిరావాలని ఆయన కోరారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షుడు మార్తినేని ధర్మారావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కేవీ.రంగాకిరణ్, ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు, నాయకులు తాండ్ర వినీత్‌రావు, శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్, శ్రీధర్‌యాదవ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న పొంగులేటి, రంగా కిరణ్

సీతారామ ప్రాజెక్టు కాలువలపై వంతెనలు నిర్మించాలి

● మంత్రి తుమ్మలకు అంకంపాలెం రైతుల వినతి



మంత్రి తుమ్మలను కలిసిన అంకంపాలెం రైతులు

దమ్మపేట, ఏప్రిల్ 27: అంకంపాలెం పంచాయతీ పరిసరాలలో నిర్మిస్తున్న సీతారామ కాలువలపై వంతెనలు నిర్మింపజేసేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ పరిధిలోని సుమారు 150 మంది రైతులు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణను వేర్వేరుగా కలిసి వినతి పత్రం అందజేశారు. కాలువలు తీసి వంతెనలు నిర్మించకపోవడం వల్ల పొలాలకు వెళ్లేందుకు రహదారులు లేక ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. అంకంపాలెంలో మహిళా కళాశాలకు స్థలం అందుబాటులో ఉందని, భవనాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే జారే ఆదినారాయణలు ఎన్నికలు అయిన వెంటనే ఈ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొయ్యల అచుతరావు, కేవీ సత్యనారాయణ, కాక రమేష్, వగ్గెల పొట్టి, కాకా ప్రసాద్, తాటి రాము, కొంద్రు సాయి, మడకం గంగరాజు, కూరం సతీష్, వాడే ప్రవీణ్, మోకాళ్ళ వితేజ్, కూరం నాగేష్, వగ్గెల నవీన్, వెంకటేష్, దిలీప్, విష్ణు, శివనాగరాజు, అబి, సురేష్ పాల్గొన్నారు.

లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులను అభినందించిన మంత్రి

భద్రాచలం, ఏప్రిల్ 27: ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన భద్రాచలంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థల విద్యార్థులను రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం విద్యార్థులు ఇంటర్ పరీక్షల్లో 467 మార్కులు సాధించడమే కాక, 49 మంది విద్యార్థులు 400 మార్కులు దాటి ప్రతిభ చూపారని కొనియాడారు. ఉన్నతమైన ఆశయాలతో మాగంటి సూర్యం ఏజెన్సీ ప్రాంతంలో లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థలను నెలకొల్పారని, సూర్యం అనంతరం ఆయన కుమారులు కూడా మాగంటి ఆశయాలను కొనసాగిండం గొప్ప విషయమన్నారు. విద్యా సంస్థల డైరెక్టర్లు మాగంటి ప్రసాద్‌బాబు, రమేష్‌బాబులను మంత్రి తుమ్మల ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బషీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల హక్కుల కోసం పోరాటం

● ఎన్‌ఎఫ్‌పీఈ రాష్ట్ర కార్యదర్శి శ్రవణ్‌కుమార్

ఖమ్మం మామిళ్లగూడెం, ఏప్రిల్ 27: తపాలా ఉద్యోగుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని ఎన్‌ఎఫ్‌పీఈ రాష్ట్ర కార్యదర్శి శ్రవణ్‌కుమార్ అన్నారు. శనివారం ఖమ్మం ప్రధాన తపాలా కార్యాలయంలో గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం ఎన్‌ఎఫ్‌పీ ఈ రాష్ట్ర అధ్యక్షుడు లెనిన్ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల అశాస్త్రీయ లక్ష్యాలను నిర్దేశించి ఉద్యోగులను ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. బండి జయరాజు, లెనిన్ శ్రీనివాస్ తదితరులు మాట్లాడుతూ పన్నెండు ఏళ్లగా వేరు వేరుగా పోరాటాలు చేసిన సంఘాలు ఇటీవల దేశ వ్యాప్తంగా పోరాట ప్రణాళికతో ముందుకు సాగడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టాభి, మౌలాలి, జిల్లా కార్యదర్శులు బండెల నాగరాజు, పెరుగు నాగేశ్వర్రావు, ఏలూరి శ్రీనివాసరావు, శ్రీనివాస్, కనకయ్య, రవీందర్, మల్లయ్య, రాజేశ్వరి, రాణి, రామారావు, సురేష్ పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న తపాలా ఉద్యోగులు

వేగంగా భద్రాద్రి కరకట్ట పనులు

- మంత్రి తుమ్మల చొరవతో ముమ్మరంగా నిర్మాణ పనులు
- వరదల సీజన్ నాటికి పూర్తి చేసే పనిలో అధికారులు



కొనసాగుతున్న కరకట్ట నిర్మాణ పనులు

భద్రాచలం, ఏప్రిల్ 27: రెండేళ్ల క్రితం నాటి వరద ముంపు పరిస్థితులు భద్రాచలంలో పునరావృతం కాకూడదు.....నిర్ణీత సమయం నాటికి వరద కరకట్ట పనులన్ని పూర్తి కావాలి.....భద్రాద్రివాసులకు మరోసారి వరద ముంపు భయం వెంటాడకూడదనే లక్ష్యంతో కరకట్ట పనులు వేగంగా సాగుతున్నాయి. భద్రాచలం శివారులోని 700 మీటర్ల వరద కరకట్ట పనులు ఇటీవల ప్రారంభం కాగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో పనులు వేగంగా సాగుతున్నాయి. ఈ క్రమంలో ఇటీవల భద్రాచలం వచ్చిన మంత్రి తుమ్మల పనుల పురోగతిని స్వయంగా పరిశీలించారు. ఇదే సమయంలో జూన్ నాటికి పనులన్నీ పూర్తి చేయాలని పనులు చేపడుతున్న వారికి సూచించారు. ఇదే క్రమంలో తాజాగా జిల్లా అధికారులతో సైతం పనుల పురోగతిపై సమాచారం తెలుసుకున్న మంత్రి తుమ్మల ఇందుకు సంబంధించిన పనులు వరదల సీజన్ ఆరంభం నాటికి పూర్తి చేయాలని సూచించినట్లు తెలుస్తోంది.

ఇకపై రక్షణ గోడగా నిలవనున్న కరకట్ట

రాబోయే గోదావరి వరదలకు భద్రాద్రివాసులకు ముంపు బెడద లేకుండా ఇకపై కరకట్ట రక్షణ గోడగా నిలవనుంది. గోదావరి ముంపు నుంచి రక్షించేందుకు భద్రాచలం సుభాష్‌నగర్ కాలనీ వద్ద నుంచి చేపట్టాల్సిన మిగులు కరకట్ట నిర్మాణ పనులకు కాంగ్రెస్ ప్రభుత్వంలో మోక్షం లభించింది. 700 మీటర్ల కరకట్ట నిర్మాణ పనులు రూ.38.045 కోట్ల అంచనా విలువలతో చేపట్టి పనుల వేగం పెంచారు. దశాబ్ద కాలంగా మిగులు కరకట్ట పనులు చేపట్టాల్సి ఉన్నా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో 2022 జూలై 16న 71.3 అడుగుల నీటిమట్టంతో మహోగ్ర గోదావరి రావడంతో పట్టణంలోని శివారు కాలనీలన్ని నీట మునిగాయి. దీంతో భద్రాద్రివాసులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో తమకు ముంపు నుంచి రక్షణ కల్పించేందుకు కరకట్ట మిగులు పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో కొలువుదీరడంతో పాటు మంత్రి తుమ్మల ప్రత్యేకంగా పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి అవసరమైన అనుమతులు ఇప్పటికే వచ్చేలా సహకారం అందించారు. ఈ నేపథ్యంలోనే విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిలో నిర్మాణంలో ఉన్న ఈ కరకట్టను ఆర్‌అండ్‌బీ ఇంజనీరు ఇన్ చీఫ్ గణపతిరెడ్డి పరిశీలించి అనుమతులు మంజూరు చేశారు. దీంతో పనులు నిర్ణీత సమయంలోపు పూర్తి చేసేందుకు మార్గం సుగమం అయ్యిందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

కరకట్ట నిర్మాణంతో తీరనున్న కష్టాలు

భద్రాచలంలో నూతనంగా నిర్మిస్తున్న మిగులు కరకట్ట నిర్ణీత సమయంలో పూర్తయితే భద్రాద్రివాసుల కష్టాలు తీరే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనికి కారణం లేకపోలేదు. 2022 జూలై మహోగ్ర గోదావరి వరదల సమయంలో కేవలం కరకట్ట లేని ప్రాంతంతో పాటు కరకట్టలో ఉన్న స్లూయిస్‌ల లీకుల కారణంగానే ఆ పరిసరాలు, ఇళ్లు ముంపునకు గురయ్యాయి. కరకట్టే లేకపోతే భద్రాచలం మూడోంతులు జలమయం అయ్యే పరిస్థితి ఉండేది. భద్రాచలానికి కరకట్ట లేని సమయంలో 50 అడుగులు వస్తే పట్టణంలోని రామాలయం ప్రాంతం, చప్టా దిగువ, శిల్పినగర్, అంబాసత్రం, కొత్తకాలనీ, అయ్యప్ప కాలనీలు జమలయం అయ్యే పరిస్థితి ఉండేది. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రూ.53 కోట్లు మంజూరు చేసి యటపాక నుంచి సుభాష్‌నగర్ వరకు పది కిలోమీటర్లకు పైగా కరకట్ట నిర్మించారు. దీంతో భద్రాచలం పట్టణంతో పాటు శివారున ఉన్న రాజుపేట, మేడువాయి తదితర గ్రామాలు కూడా వరద ముంపు తప్పింది. 2022 జూలై 16న భద్రాచలం వద్ద గోదావరి71.3 అడుగుల నీటిమట్టంతో ప్రవహించడంతో ఎంతో అపార నష్టం సంభవించింది. సుభాష్‌నగర్ కాలనీ, శాంతినగర్ కాలనీ, కూనవరం రోడ్డు, సీఆర్‌పీఎఫ్ ఎక్యాంపు కార్యాలయాలు పూర్తిగా నీట మునిగాయి. ఇదంతా కేవలం కరకట్ట లేని ప్రాంతం నుంచి వచ్చిన వరద నీటి కారణంగానే జరిగింది. ప్రస్తుతం నిర్మిస్తున్న కరకట్ట అనుకున్న సమయానికి పూర్తయితే పట్టణంలో పైన పేర్కొన్న కాలనీలకు ముంపు సమస్య దాదాపుగా పరిష్కారమవుతుంది. అయితే కరకట్ట మొత్తాన్ని పటిష్ఠ వంతం చేసి, ఎత్తు పెంచితే భద్రాద్రికి భవిష్యత్తులో పోలవరం బ్యాక్ వాటర్ కారణంగా వచ్చే సమస్యకు పరిష్కారం లభించినట్లు అవుతుందని భద్రాద్రివాసులు పేర్కొంటున్నారు.



ఐక్యతను చాటుతున్న ఇండియా కూటమి నాయకులు

బీఆర్ఎస్, బీజేపీలను

బొంద పెడతాం

» కొత్తగూడెంలో సన్నాహక సమావేశంలో మంత్రి పొంగులేటి

కొత్తగూడెం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలను బొంద పెడతామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గతంలో బీఆర్ఎస్ మాయ మాటలు నమ్మి ఆ పార్టీలో చేరి అక్కడ ఉండలేక ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరుతున్న ప్రతీఒక్కరికీ ఆహ్వానం పలుకుతున్నామని తెలిపారు. భద్రాద్రి జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలో శనివారం ఖమ్మం లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డిని ప్రజలకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులో భాగంగా కొత్తగూడెం సీటును మిత్రపక్షమైన సీపీఐకి కేటాయించడంతో కాంగ్రెస్ శ్రేణులు నిరుత్సాహానికి గురయ్యారని తెలిపారు. కానీ ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అధిక అసెంబ్లీ స్థానాలను గెలుచుకొని బీఆర్ఎస్‌ను ప్రజలు సాగనంపారన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసినోళ్లు ఇందిరమ్మ రాజ్యాన్ని విమర్శించేదని ఎద్దేవా చేశారు. రూ.46వేల కోట్లు ఖర్చు చేసిన మిషన్ భగీరథ పథకం ద్వారా ఎంతమందికి ఇంటింటికి నీళ్లు అందించారో తెలపాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ కారును తుక్కుకాటాలో పెట్టే సమయం వచ్చిందన్నారు. ప్రాంతాల మధ్య, మతాల మధ్య చిచ్చుపెట్టేలా బీజేపీ వ్యవహరిస్తోందన్నారు. విభజన హామీ చట్టం ప్రకారం కొత్త రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం ఎటువంటి సహకారం అందించలేదన్నారు.రాష్ట్రంలో 17 లోక్‌సభస్థానాల్లో కాంగ్రెస్ 15స్థానాల్లో విజయం సాధిస్తుందని స్పష్టం చేశారు. ఈ విజయంలో ఖమ్మం మొదటి వరుసలో ఉంటుందని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో జడ్పీచైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య, ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాడు తోట దేవిప్రసన్న, టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు, సీపీఎం రాష్ట్ర నాయకుడు కాసాని ఐలయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, వెంకటేశ్వర్లు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎడవల్లి కృష్ణ, కోనేరు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన దంతెలబోర మాజీ సర్పంచ్ రమేష్



సీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న రమేష్

పాల్వంచ, ఏప్రిల్ 27: పాల్వంచ మండలం దంతెలబోర ఎస్సీ కాలనీ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గద్దల రమేష్ శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని సీఎంను కోరినట్లు ఆయన తెలిపారు.


కానిస్టేబుల్ నాగముత్యాన్ని సన్మానించిన డీజీపీ



నాగముత్యాన్ని సన్మానిస్తున్న డీజీపీ రవిగుప్తా

దమ్మపేట, ఏప్రిల్ 27: దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ నాగముత్యాన్ని డీజీపీ రవిగుప్తా శనివారం డీజీపీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఇటీవల జరిగిన మేడారం జాతరలో గుండెపోటుతో పడిపోయిన ముగ్గురు వ్యక్తుల ప్రాణాలను కాపాడిన అతడిని అభినందించి సత్కరించారు. ఈకార్యక్రమంలో అడిషనల్ డీజీపీ మహేష్‌బగవత్ వున్నారు.

అగ్నిప్రమాదంలో సుబాబుల్ దగ్ధం



దగ్ధమవుతున్న సుబాబుల్ పంట

మధిరరూరల్, ఏప్రిల్ 27: అగ్ని ప్రమాదంలో సుబాబుల్ పంట దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని ఖమ్మంపాడు గ్రామంలో చోటు చేసుకుంది. పొలాల్లో చెత్తకు నిప్పుపెడుతుండగా ఆ నిప్పురవ్వల ప్రమాదవశాత్తూ ఖమ్మంపాడు గ్రామంలో గడసందుల వెంకటేశ్వర్లు, బండి సీతారామయ్య, కల్యాణపు పూర్ణయ్యకు చెందిన ఏడెకరాల్లోని సుబాబుల్ పంటకు అంటుకున్నాయి. దీంతో ఏడెకరాల్లోని సుబాబుల్ పంట దగ్ధమైంది. సుమారు రూ.మూడులక్షల వరకు నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు

జూలూరుపాడు, ఏప్రిల్ 27: కొత్తగూడెంలోని కూలీలైనుకు చెందిన చాందుల నాగేశ్వరరావు, అతని భార్య పద్మలు కారులో కొత్తగూడెం నుంచి ఖమ్మం వెళ్తుండగా వినోబానగర్ సమీపంలో కారు అదుపు తప్పి చెట్టును ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు.

చంద్రుగొండ: మండలంలోని గురాయిగూడెం గ్రామానికి చెందిన దిలీప్ దామరచర్ల వైపు నుంచి చంద్రుగొండకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా తహసీల్దార్ కార్యాలయం సమీపంలో వాహనం అదుపుతప్పి డీవైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతడికి గాయాలయ్యాయి. స్థానికులు 108 సహాయంతో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గెలిపించే బాధ్యత మీది..అభివృద్ధి బాధ్యత మాది

(5వ పేజీ తరువాయి)

విలువలకు తిలోదకాలిచ్చి దిగజారి విమర్శలు చేస్తున్నారన్నారు. ఇప్పటికే ముగిసిన రెండు విడతల పోలింగ్‌లో ఇండియా కూటమికే మెజారిటీ వస్తుందని తెలిసి ప్రధాని తన స్థాయిని మరిచి విమర్శలు చేస్తున్నారన్నారు. దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన గాంధీ కుటుంబం కావాలా లేక దేశ సంపదను అదాని, అంబానీ లాంటి పెట్టుబడిదారులకు కట్టబెడుతున్న మోదీ కావాలో ప్రజలు తేల్చుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు కర్రు కాల్చి వాత పెట్టిన ప్రజలు మళ్లీ ఈ ఎన్నికల్లో ప్రజల ముందుకు వస్తున్న ఆ పార్టీకి ఏ వాత పెట్టాలో తేల్చాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేకపోయినా ఉన్నట్లు ప్రజలను పక్కదోవ పట్టిస్తున్న బీఆర్ఎస్ నేతల ప్రచారాలను తిప్పి కొట్టాలన్నారు. రోజుకు రూ.50కోట్లు ఖర్చుపెట్టి విద్యుత్ కొనుగోలు చేసి కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు.

'ఇండియా'ని గెలిపించాలి

మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజలందరి కష్టం, కృషి వల్ల రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం స్ఫూర్తితో లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' కూటమిని భారీ మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గెలుపు కంటే మెజారిటీయే ముఖ్యమన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వంలో ప్రజలు కోరుకున్నట్లు ఆరు గ్యారంటీలు అమలవుతున్నాయని, మోదీ పాలనలో అభివృద్ధి లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో తెలంగాణలో అన్నివర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘురాంరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ పదేళ్ల పాలనలో ప్రజలను మోసం చేసిందన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వలేదని, గ్యాస్, పెట్రోల్ ధరలు పెరిగాయని విమర్శించారు. బీజేపీ తాము అయోధ్యలో రామాలయం నిర్మించారని చెప్పుకుంటున్నారని, కానీ తామూ గ్రామాల్లో రామాయాలు నిర్మించామన్నారు. తన పేరులోనే రాముడున్నాడని గుర్తు చేశారు.

సమావేశంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర అధ్యక్షుడు జావీద్, కాంగ్రెస్ నాయకులు రాయల నాగేశ్వరరావు, వామపక్షాల నాయకులు యర్రా శ్రీకాంత్, మహ్మద్‌సలాం, విక్రం, జానీమియా, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహరా తదితరులు పాల్గొన్నారు.

భర్త, మామలపై కేసు నమోదు

పాల్వంచ, ఏప్రిల్ 27: భార్యను వేధిస్తున్న ఘటనలో భర్త, మామలపై పాల్వంచ రూరల్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాల్వంచ మండలం సోములగూడెం గ్రామానికి చెందిన అనితకు నాగారానికి చెందిన గంగపురి అనిల్‌తో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. ఈ మధ్య కాలంలో అనిల్ మద్యానికి బానిసై అదే గ్రామానికి చెందిన మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయంపై పెద్దలు పలు మార్లు ఇద్దరికీ సర్దిచెప్పడానికి ప్రయత్నించారు. కానీ అతడిలో ఎటువంటి మార్పు కనిపించలేదు. అంతే కాక మామా లక్ష్మయ్య కూడా కోడలిని వేధించసాగాడు. దీంతో భర్త, మామలపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

దాడి ఘటనలో ముగ్గురిపై కేసు

పాల్వంచ, ఏప్రిల్ 27: మద్యం మత్తులో ఇద్దరు వ్యక్తులపై దాడి చేసిన ఘటనలో ముగ్గురిపై పాల్వంచ టౌన్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. టేకులపల్లి మండలం సంపత్‌నగర్‌కు చెందిన గోడా వంశీ, కుంపటి లోకేష్, బాదావత్ సాయిలు గురువారం పాల్వంచ జాతీయ రహదారిపై ఉన్న ఓ వైన్ షాపునకు వచ్చారు. డబ్బులు తక్కువయ్యాయని, తరువాత ఇస్తామని బేరర్లు రాజశేఖర్, కృష్ణలతో వాగ్వావాదానికి దిగారు. అంతటితో ఆగకుండా వారిపై భౌతికదాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో బేరర్ కృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి.

స్థానికులు అతడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో బాధితుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు నిందితులు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు.



ఖమ్మం యూనిట్ కార్యాలయంలో ఆంధ్రజ్యోతి సంస్థల డైరెక్టర్ కనకదుర్గకు నివాళులర్పిస్తున్న పబ్లిషర్ కోగంటి వెంకట శేషగిరిరావు, ఉద్యోగులు, సిబ్బంది



ఏబీఎన్- ఆంధ్రజ్యోతి సంస్థల డైరెక్టర్

కనకదుర్గకు ఘన నివాళి

పుష్పాంజలి ఘటించిన పబ్లిషర్ కోగంటి వెంకట శేషగిరిరావు

ఖమ్మం కార్పొరేషన్, ఏప్రిల్ 27: ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల డైరెక్టర్ వేమూరి కనకదుర్గ తృతీయ వర్ధంతి సందర్భంగా శనివారం 'ఆంధ్రజ్యోతి' ఖమ్మం యూనిట్ కార్యాలయంలో ఘన నివాళులు అర్పించారు. ఆంధ్రజ్యోతి పబ్లిషర్ కోగంటి వెంకట శేషగిరిరావు, ఆయన సతీమణి లక్ష్మి, ఖమ్మం యూనిట్ మేనేజర్ తాళ్లూరి పుల్లారావు, ఎడిషన్ ఇన్‌చార్జ్ శంకర్‌రావు శెంకేసి, బ్యూరో ఇన్‌చార్జ్ నలజాల వెంకటరావుతోపాటు ఉద్యోగులు పుష్పాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డైరెక్టర్‌గా పనిచేసిన కనకదుర్గ ఉద్యోగుల సంక్షేమానికి ఎంతో కృషి చేశారన్నారు. ఆంధ్రజ్యోతి సంస్థ అభివృద్ధికి ఆమె చేసిన సేవలు మరువలేనివన్నారు. 'ఆంధ్రజ్యోతి'ని నెంబర్‌వన్‌గా నిలిపేందుకు అహర్నిశలు కృషి చేశారన్నారు. ఎంతటి చిన్న ఉద్యోగులనైనా ఆప్యాయంగా పలకరించేవారని గుర్తుచేసుకున్నా రు. మొక్కగా ఉన్న ఆంధ్రజ్యోతిని వటవృక్షంగా మార్చారని, ఆ నీడలో వేలాది కుటుంబాలు జీవనం పొందుతున్నాయని పేర్కొన్నారు. మహిళా సాధికారతకు ఆమె స్ఫూర్తి అని కొనియాడారు. కార్యక్రమంలో యాడ్స్ మేనేజర్ మాన్రప్రగడ రమేష్, సర్క్యులేషన్ మేనేజర్ మొగలపు వెంకట సూర్యనారాయణ, స్టాఫ్‌రిపోర్టర్ తాళ్లూరి రమేష్, ఏబీఎన్ స్టాఫ్‌రిపోర్టర్ శ్రీధర్, ప్రింటింగ్ ఇన్‌చార్జ్ సురేష్, టెక్నికల్ ఇన్‌ఛార్జ్ నాగేశ్వరరావు, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి మృతి

మధిరటౌన్, ఏప్రిల్27: మద్యం మత్తులో వ్యక్తి మృతి చెందిన సంఘటన మధిర మార్కెట్ యార్డులో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా పెనగంచిప్రోలు మండలం వెల్లుర్తిపాడు గ్రామానికి చెందిన ఉప్పు పున్నారావు(44) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం సొంత పని నిమిత్తం మధిరకు వచ్చాడు. సాయంత్రమైన ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మధిరలోని బంధువులకు సమాచారం అందించారు. కాగా అతడికి మద్యం సేవించే అలవాటు ఉండగా, మద్యం షాపు పక్కనే ఉన్న మధిర వ్యవసాయ మార్కెట్ యార్డులో వారు వెతకగా మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యం తాగటం వల్లే మృతి చెంది ఉంటాడని, తమకు ఎవరి మీద అనుమానం లేదని మృతుడి భార్య ఉప్పు సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ సంధ్య తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు...

ముదిగొండ, ఏప్రిల్ 27: చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రాఘవాపురం గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాధినేని ఉపేందర్ (28)వ్యవసాయ పనులు చేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 25న వ్యక్తిగత కారణాలతో గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు అతడిని ఖమ్మంలో ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య ఉంది. మృతుడి తండ్రి నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో మూడు ఆవులు...

కారేపల్లి ఏప్రిల్27: విద్యుదాఘాతంతో మూడు ఆవులు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని సూర్యతండాలో చోటు చేసుకుంది. ఇటీవల కురిసిన వర్షంతో విద్యుత్ తీగలు కిందపడడంతో వాటికి విద్యుత్ సరఫరా జరుగుతుంది. శనివారం మేత కోసం అటుగా వెళ్లిన ఆవులు విద్యుదాఘాతానికి గురై బాధిత రైతులు బాణోతు రాంచంద్, బాదావత్ హన్మ, బాదావత్ మోతీలాల్ తెలిపారు.

జమలాపురంలో శ్రీవారికి సర్వాంగాభిషేకం

ఎర్రుపాలెం, ఏప్రిల్27: జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో సర్వాంగాభిషేకం జరిపించారు. శనివారం స్వామి వారు ముత్యాల కవచ అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకిలో ఊరేగించి కల్యాణ వేదికవద్దకు చేర్చి నిత్యకల్యాణం నిర్వహించారు. భక్తుల రద్దీతో క్యూలైన్లు నిండిపోయాయి. ఆలయ సిబ్బంది శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు ఉచిత అన్నదాన వితరణ చేశారు.భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావు, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, సిబ్బంది కృష్ణప్రసాద్, సాయి, వంశీ, విజయ్, మారుతిరావు, విజయ్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

బూర్గంపాడు, ఏప్రిల్27: మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని సారపాకలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం పట్టణానికి చెందిన నౌషద్‌బాషా(25)కు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. తగిలిన గాయాలు మానకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు అతడిని సారపాకకు తీసుకువచ్చారు. శనివారం తెల్లవారు జామున అందరూ నిద్రిస్తున్న సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి బీబీఫాతిమా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలి

జూలూరుపాడు, ఏప్రిల్ 27: ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించటంలో అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుండటంతో కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు ఎస్‌కె.ఉమర్ అన్నారు. శనివారం మండలంలోని గుండెపుడి, రామచంద్రపురం, వెంగన్నపాలెం, జూలూరుపాడు గ్రామాలలోని ఉపాధి పనుల ప్రదేశాలను ఏఐకేఎంఎస్ నాయకులు సందర్శించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంఘం జిల్లా నాయకులు వల్లోజి రమేష్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశాలలో ఆయన మాట్లాడుతూ పని ప్రదేశాలలో కూలీలకు తాగునీరు, నీడ సౌకర్యం కల్పించకపోవటం తగదన్నారు. కూలీలకు రోజు వారి వేతనం రూ.300 అందిచటంతో పాటు గడ్డపారాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాలలో అన్ని వసతులను కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. డిసెంబర్ నెల నుంచి కూలీలకు పెండింగ్‌లో వున్న వేతనాలను తక్షణమే వారి ఖాతాలలో జమ చేయాలని కోరారు.

భానుడి భగభగ.. అల్లాడుతున్న ప్రజలు

నిర్మానుష్యమవుతున్న రహదారులు

వడదెబ్బ బాధితులతో కిటకిటలాడుతున్న ఆసుపత్రులు

జూలూరుపాడు, ఏప్రిల్ 27: మండుతున్న ఎండల తీవ్రతతో ప్రజలు విలవిలలాడుతున్నారు. గత కొద్ది రోజులుగా భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండతో పాటు ఉక్కపోత కూడా అధికంగా ఉండటంతో ప్రజలు తట్టుకోలేకపోతున్నారు. గత మూడు రోజులుగా వడగాలుల తీవ్రత పెరగటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శనివారం జూలూరుపాడులో 41డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదయింది. భానుడి ప్రతాపానికి ఉదయం 10గంటల దాటిన తరువాత ప్రజలు ఇళ్ళకే పరిమితమవుతున్నారు. దీంతో రహదారులన్నీ నిర్మానుషంగా మారి దర్శమిస్తున్నాయి. పది గంటల తరువాత ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్నారు. దీంతో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. వడగాలుల తీవ్రత పెరగటంతో గత కొద్ది రోజులుగా వడదెబ్బ బారినపడిన వారి సంఖ్య రోజురోజుకి పెరుగుతుంది. వడదెబ్బ రోగులతో జూలూరుపాడులోని ప్రభుత్వ, ప్రవేట్ ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రస్తుతం పరిస్థితి ఇలా ఉంటే ముందుముందు ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎండల తీవ్రత పెరగడంతో శీతల పానీయాలకు గిరాకీ పెరిగింది. కొబ్బరిబోండాల విక్రయ కేంద్రాల వద్ద జన సందడి కనిపిస్తోంది. రోజురోజుకూ పెరుగుతున్న ఎండలతో జీవనం ఎలా అని ప్రజలు భీతిల్లుతున్నారు. ఎండల తీవ్రత ఇలాగే ఉంటే రానున్న కాలంలో మరింత జఠిలంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వడదెబ్బ బాధితుడు



చెట్టుకింద సేదదీరుతున్న పశువులు



నిర్మానుష్యంగా జూలూరుపాడు ప్రధాన రహదారి

రఘురాంరెడ్డి గెలుపునకు కృషిచేయాలి

కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే జారే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట, ఏప్రిల్ 27: ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి రఘురామి రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని అశ్వారావు పేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పిలుపు నిచ్చారు. గండుగులపల్లిలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం దమ్మపేట మండల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతు 2023 డిసెంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో తనను రాష్ట్రంలో మొదటి సీటు అశ్వారావుపేట నియోజకవర్గం నుంచి గెలిపించారని, అదే స్ఫూర్తితో ఎంపీ అభ్యర్థి రఘురామిరెడ్డి గెలుపునకు కార్యకర్తలు సమిష్టిగా పనిచేసి 50వేల మెజారిటిని అశ్వారావుపేట నియోజకవర్గంలో వచ్చేవిధంగా కృషి చేయాలని అన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గంలో ఒక్క నెలలోనే 20 కోట్ల రూపాయిలతో సీసీ రోడ్లు, మంచి నీటి సౌకర్యం, పాఠశాలల అభివృద్ధికి కృషి చేయటం జరిగిందని ఎమ్మెల్యే గుర్తు చేసారు. కాంగ్రెస్‌పార్టీ చేసిన అభివృద్ధితో పాటు ఎన్నికల్లో ఇచ్చిన ఐదు హామీలను నెరవేర్చటం జరిగిందని ఇంటింటికి వెళ్లి వివరించాలని కోరారు.

వేద గాయత్రిదేవి ఆలయంలో అన్నదానం



అన్నప్రసాదం స్వీకరిస్తున్న వారు

మణుగూరు, ఏప్రిల్ 27: మణుగూరు పట్టణంలోని పంచముఖి వేద గాయత్రి దేవి ఆలయం ప్రాంగణంలోని వేంకటేశ్వరస్వామి సహిత శ్రీ ఉమా రామలింగేశ్వరాలయాల ఆవరణలో శనివారం భక్తులకు అన్న ప్రసాదా వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్న ప్రసాదా దాతలపైన సముద్రాల చిన్న మస్తాన్‌రావు, వెంకటరమణ, సముద్రాల వెంకటేశ్వరరావు-సంతోషి వెంకటలక్ష్మీ, మిట్టపల్లి శ్యామ్-ప్రనూష దంపతుల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

టీబీజీకేఎస్ మాజీ నేతల సమావేశం

మణుగూరుటౌన్, ఏప్రిల్ 27: సింగరేణి కార్మికులు, నాయకులు, శ్రేయోభిలాషుల అభిప్రాయాల మేరకే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని టీబీజీకేఎస్ మాజీ నాయకలు ప్రభాకర్‌రావు అన్నారు. శనివారం ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. భవిష్యత్ కార్యచరణ చేపట్టేందుకు ఏ కార్మిక సంఘం కార్మికుల సంక్షేమానికి, హక్కుల పరిరక్షణకు సహకరిస్తుందో, ఏ రాజకీయ పార్టీ మద్దతు నిస్తుందో సమాలోచనలు చేసేందుకు గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో మణుగూరు ఏరియకు చెందిన టీబీజీకేఎస్ కార్మిక సంఘం మాజీ నాయకులు ఏరియాలోని కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, అభిమానులతో కలసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించామన్నారు. సమావేశంలో భవిష్యత్ కార్యచరణ కోసం కార్మికులతో పాటు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకుల అభిప్రాయాలను తెలుసుకున్నామన్నారు. ఏ నిర్ణయమైన త్వరితగతిన తీసుకోవాలని ఏ పార్టీ తమకు అండగా నిలుస్తుందని భావిస్తే ఆ పార్టీ, దాని అనుబంధ పార్టీలోకి తన వెనకాలే నడిచి వస్తామని కార్మికులు, నాయకులు ఏకాభిప్రాయాన్ని వెలిబుచ్చారన్నారు. ఏ విషయమైన త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు కోరినట్లు పేర్కొన్నారు. కార్యకర్తలు, కార్మికులు, అభిమానుల అభిప్రాయాలు పూర్తి స్థాయిలో సేకరించిన తర్వాత వారి కోరిక మేరకు నిర్ణయాన్ని త్వరలోనే ప్రకటిస్తానని తెలిపారు.

కాంగ్రెస్ గూటికి ప్రభాకర్‌రావు, అనుచరులు..?

మణుగూరుటౌన్: మణుగూరు ఏరియా టీబీజీకేఎస్ యూనియన్‌లో వివిధ హోదాల్లో పదవీ బాధ్యతలు నిర్వహించిన ప్రభాకర్‌రావు, బ్రాంచి కమిటీలోని ముఖ్య నేతలతో పాటు అనుచరులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున టీబీజీకేఎస్‌కు రాజీనామా చేసిన విషయం విదితమే. కాగా రాజీనామ చేసిన నాయకులు, కార్యకర్తలతో ప్రభాకర్‌రావు నిర్వ హించిన సర్వసభ్య సమావేశంలో అత్యధికశాతం నాయకులు, కార్యకర్త లు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపినట్లు తెలిసింది. ప్రభాకర్‌రావు తీసుకున్న ఏ నిర్ణయానికి అయిన కట్టుబడి ఆయన వెంట తరలి వెళ్లేందుకు తామంత సిద్ధంగా ఉన్నట్లు ఏకగ్రీవంగా సమావేశంలో తీర్మానించారని సమాచారం. త్వరలోనే కాంగ్రెస్ గూటికి వీరందరు చేరనున్నారు. ఈ విషయమై ప్రభాకర్‌రావుతో 'ఆంధ్రజ్యోతి' మాట్లాడగా.. అందరి అభిప్రాయాల మేరకే తాను ముందుకు వెళతానని తెలిపారు.

కార్మికుల సంక్షేమంలో నిర్లక్ష్యం వద్దు

రుద్రంపూర్, ఏప్రిల్ 27: కార్మికుల సంక్షేమం విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని డైరెక్టర్(పా) ఆపరేషన్స్ ఎస్‌వీకే శ్రీనివాస్ కోరారు. శనివారం కొత్తగూడెంలోని ఇల్లందు క్లబ్‌లో అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్నల్, ఎక్స్‌టర్నల్ నియామకాలు, కారుణ్య నియామకాలు, ఆన్‌లైన్ ద్వారా సీఎంపీఎఫ్ క్లెయిమ్స్‌ను త్వరితగతిన పరిష్కరించే విధానం, కేసులు తదితరాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెల్ఫేర్‌కి సంబంధించి ఎటువంటి ఫైల్స్ పెండింగ్‌లో ఉంచకుండా త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సింగరేణి వ్యాప్తంగా అతి త్వరలో ఉద్యోగుల హాజరును ఫేషియల్ రికగ్నిషన్ అప్లికేషన్ ద్వారా నమోదు చేయటానికి సన్నహాలు చేస్తున్నట్టు తెలిపారు. గనులు, డిపార్ట్‌మెంట్‌లలో సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ ఉద్యోగి తన సమయానికి అనుగుణంగా విధులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సుదీర్ఘంగా పది సంవత్సరాలు జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందుతున్న జీఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ ఆర్‌సీ కె.బసవయ్యకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జీఎం (పర్సనల్) ఐఆర్ అండ్ పీఎం బి.హనుమంతురావు, జీఎం (పర్సనల్) ఈఈ అండ్ సీఎస్ఆర్ కవిత నాయుడు, సూపర్‌బజార్ ఎండీ సామ్యూల్, తదితరులు పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే పాయం పర్యటన



నూతన దంపతులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే పాయం

అశ్వాపురం ఏప్రిల్ 27: మండలంలో శనివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పర్యటించారు. మండల పరిధిలోని కల్యాణపురం గ్రామంలో నూతన దంపతులు మూడ్ ప్రత్యూష-వెంకటేశ్, మొండికుంట గ్రామంలో పగడాల అఖిల్‌రెడ్డి-ఉమారాణి, యంగళ్ళశ్రీకాంత్‌రెడ్డి-శ్రీహితదంపతులను ఆశీర్వదించి నూతన వస్త్రాలను అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న మల్లెలమడుగు గ్రామానికి చెందిన వేల్పుల నారాయణను ఎమ్మెల్యే పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముత్తినేని సుజాత,మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు షర్ఫుద్దీన్, నెల్లిపాక సింగిల్ విండో చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, మొండికుంట ఎంపిటిసి కమటం నరేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'భూ తాపం నియంత్రణలో చెట్లు ప్రధానం'



వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శిస్తున్న ఎన్‌ఎస్ఎస్ విద్యార్థులు

అశ్వారావుపేట, ఏప్రిల్ 27: భూతాపాన్ని తగ్గించడంలో, వాతావరణ సమతౌల్యతకు చెట్లు ప్రధానమైనవని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. హేమంత్‌కుమార్ అన్నారు. శనివారం ఎన్‌ఎస్ఎస్ ప్రత్యేక శిబిరంలో భాగంగా నారాయణపురంలోని పలు వ్యవసాయ క్షేత్రాలను, తోటలను సందర్శించారు. పెదవాగు ప్రాజెక్టును సందర్శించి ప్రాజెక్టు వివరాలను తెలుసుకున్నారు. రోడ్ల వెంట చెట్లును నాటారు.

ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన

దమ్మపేట, ఏప్రిల్ 27: వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ఉద్యాన పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా వ్యవసాయ ఉద్యాన, పట్టు పరిశ్రమల అధికారి సూర్యనారాయణ గున్నెపల్లిలో వ్యవసాయ క్షేత్రంలో శనివారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కొబ్బరి, మామిడి, అరటి, జీడిమామిడి, కూరగాయలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు వివరించారు. సూక్ష్మసేద్య విధానం, బిందుసేద్య పరికరాలవాడకం నిబంధనలను వివరించారు. అధిక ఉష్ణోగ్రతలు నేపధ్యంలో పామాయిల్ మొక్కలకు చెట్టుకు రెండువైపుల డ్రిప్పర్‌ల ద్వారా నీటిని అందించాలని, చెట్టుకు రెండు వరుసల్లో జనుము పచ్చిరొట్ట విత్తనాలు వేసి పెంచాలని అనంతరం కలియ దున్నాలని తెలిపారు. కొమ్ము పురుగు నివారణకు లామ్డా సైహలోథ్రిన్ కీటకనాశిని లీటర్ నీటిలో 2ఎంఎల్ కలిపి మొవ్వ ఆకులలో పోయాలని తెలిపారు. మూడు సంవత్సరాల పామాయల్ చెట్లలలో పొత్తులను తీసివేయాలని సూచించారు. పీచు, డీమక్ ఉపయోగించుకొని ఎరువుగా మల్చింగ్ చేయటం వల్ల ఖర్చు తక్కువతో సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గున్నేపల్లి, గణేష్‌పాడు, నాయుడుపేట, గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వో సందీప్, ఆయిల్‌ఫెడ్ సిబ్బంది పాల్గొన్నారు.



నీటిని అందించే విధానాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

హామీని మరచిన కాంగ్రెస్ ప్రభుత్వం

మణుగూరుటౌన్, ఏప్రిల్ 27: సింగరేణి సంస్థలో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయుసీ, ఏరియా ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయుసీలు కార్మికుల ఇన్‌కం టాక్స్ రద్దుపై నోరు మెదపకపోవడం విడ్డూరంగా ఉందని హెచ్ఎంఎస్ యూనియన్ మణుగూరు ఏరియా ఉపాధ్యక్షురాలు కొడిపల్లి శ్రీలత విమర్శించారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. శాసనసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే సింగరేణి కార్మికుల ఇన్‌కం టాక్స్‌ను రద్దు చేస్తామని వాగ్దానం చేసి ఇచ్చిన హామీని ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు మరిచి పోయారన్నారు. ఈ విషయంపై గుర్తింపు, కార్మిక సంఘాలు ప్రభుత్వాన్ని ప్రశ్నించకపోవడం బాధాకరమన్నారు. జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసే ఎంపీ అభ్యర్థులు తమ అజెండాలో కార్మికుల ఇన్‌కం టాక్స్ సమస్యను చేర్చాలని, పార్లమెంట్‌లో కార్మికుల పక్షాన తమ సమస్యను లేవనెత్తాలని డిమాండ్ చేశారు. ప్రకృతికి విరుద్ధంగా కార్మికుల బొగ్గును ఉత్పత్తి చేస్తున్నారని, తద్వారా రాష్ట్రంలో విద్యుత్ సంస్థలతోపాటు ఎన్నో చిన్న పరిశ్రమలు నడుస్తున్నాయన్న విషయం ప్రభుత్వాలు, పాలకులు గుర్తుపెట్టుకోవాలన్నారు. ఇన్‌కం టాక్స్‌తో ఒక్కో కార్మికుడు చమటోడ్చి కష్టపడిన తన మూడు నెలల జీతాన్ని కోల్పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా నష్టపోతున్న కార్మికులను ప్రభుత్వాలు, పాలకులే ఆదుకోవాలన్నారు.

రోడ్‌షోను విజయవంతం చేయండి

అశ్వారావుపేట, ఏప్రిల్ 27: ఖమ్మం పార్లమెంట్‌కు కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రామసహాయం రఘురామరెడ్డి రోడ్ షో ఆదివారం సాయంత్రం 5గంటలకు అశ్వారావుపేటలో జరుగుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు జూపల్లి రమేష్, తుమ్మా రాంబాబు తెలిపారు. శనివారం పట్టణంలో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ తన విజయాన్ని కాంక్షిస్తూ రఘురామరెడ్డి చేస్తున్న ఈ రోడ్‌షోకు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాల్సిందిగా కోరారు. సమావేశంలో సొసైటీ అధ్యక్షులు సత్యనారాయణ, ఎస్‌సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పాండురంగారావు, ఎంపీటీసీలు రమేష్, మోహనరావు, నాగేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి

టేకులపల్లి, ఏప్రిల్ 27: చెక్‌పోస్టు సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణంగా పరిశీలించాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రామ్‌కుమార్ గోపాల్ ఆదేశించారు. పార్లమెంటు ఎన్నికల ప్రక్రియలో భాగంగా మండలంలోని బొమ్మనపల్లిలో కారుకొండ క్రాస్‌రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శనివారం రామ్ కుమార్ గోపాల్ సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా చెక్‌పోస్టు సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతీ వాహనాన్ని క్షుణంగా పరిశీలించాలని, అన్ని వాహనాల నెంబర్లను రిజిష్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, చెక్‌పోస్టు వద్ద సిబ్బంది వాహనాలను ఆపినప్పుడు నిలుపుదల చేయకుండా వెళ్లిన వాహనాల సమాచారాన్ని వెంటనే పోలీసులకు తెలియచేయాలని సూచించారు. రవాణా వాహనాలను కూడ తనిఖీలు చేయాలని డబ్బు, మద్యం లభించినట్టయితే వెంటనే సంబంధిత అధికారులకు తెలియచేసి పంచనామా నిర్వహించి సీజ్‌చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి సీఐ తాటిపాముల సురేష్, ఎస్సై ఎస్‌కే సైదా రావూఫ్, చెక్‌పోస్టు ఇన్‌చార్జి రవికుమార్, పోలీసు సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ జవానులు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న వ్యయ పరిశీలకుడు రామ్‌కుమార్

30న కొత్తగూడెంలో కేసీఆర్ రోడ్ షో

మణుగూరు, ఏప్రిల్ 27: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత విజయాన్ని ఆకాంక్షిస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ నెల 30వ తేదిన కొత్తగూడెంలో పర్యటించనున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు తెలిపారు. కొత్తగూడెంలో సాయంత్రం రోడ్ షో, కార్నర్ మీటింగ్‌లలో పాల్గొని ప్రజలనుద్దేశించి మాట్లాడనున్నారని తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

రోడ్ షోను విజయవంతం చేయాలి

అశ్వాపురం: ఈ నెల 30న మహబూబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి మాలోత్ కవిత, ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్తగూడెంలో నిర్వహించే రోడ్ షోను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్ కోరారు. శనివారం మొండికుంటలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్‌షో కార్యక్రమానికి మండలంలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, నాయకులు సూదిరెడ్డి గోపాలకృష్ణారెడ్డి, సుధీర్, వీరారెడ్డి, సురేష్‌రెడ్డి, రామకృష్ణ, డాక్టర్ బాబు పాల్గొన్నారు.

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం: ఈ నెల 30న కొత్తగూడెంలో జరిగే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రోడ్డు షోను దుమ్ముగూడెంతో పాటు, భద్రాచలం డివిజన్ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని బీఆర్ఎస్ భద్రాచలం డివిజన్ పార్లమెంట్ ఎన్నికల సమన్వయ కమిటి సభ్యులు మానే రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు శనివారం మండల పరిధిలోని లక్ష్మీనగరంలో జరిగిన పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతూ.. 30వ తారీకు సాయంత్రం 6గంటకు కొత్తగూడెంలో జరిగే రోడ్ షోకు ప్రతి ఒక్కరు కదిలి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అద్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ మూర్తి, రాముడు, ఎంపీపీ రేసు లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రోహిత్‌కు ఘన సత్కారం

అశ్వాపురం, ఏప్రిల్ 27: ఇటీవల విడుదలయిన ఇంటర్ పలితాల్లో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 988 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ప్రతిభ కనబర్చిన అశ్వాపురానికి చెందిన గుర్రం రోహిత్‌కుమార్‌ను శనివారం మండల ట్రిక్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... యువత కష్టపడి చదివి ఉన్నతులుగా మారాలని కోరారు. ఉత్తమ స్థాయికి చేరడం ద్వారా తల్లిదండ్రులకు, విద్యాలయానికి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు తలపనేని కొండల్‌రావు, మొండికుంట మాజీ సర్పంచ్, యూనియన్ అధ్యక్షుడు మర్రి మల్లారెడ్డి, నాయకులు చిగురుపాటి ప్రసాద్, గుర్రం రవి, రాజు పాల్గొన్నారు.



రోహిత్‌ను సన్మానిస్తున్న దృశ్యం

అర్హులైన నిర్వాసితులకు న్యాయం చేయాలి

మణుగూరుటౌన్, ఏప్రిల్ 27: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో ప్రైవేటు సెక్యూరిటీ గార్డు ఉద్యోగాలకై పరుగు పందెంలో అర్హులైన భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం ఏరియా ఎస్‌ఓటు జీఎం శ్యాంసుందర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. భూ నిర్వాసితులతో పాటు ఏరియా ఆసుపత్రిలో వార్డు బాయ్‌లకు కూడా ఉపాధి కల్పించాలని జేఏసీ కోరింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడారు. సింగరేణి సెక్యూరిటీకి అనుబంధంగా పనిచేస్తున్న ప్రైవైట్ కాంట్రాక్ట్ సెక్యూరిటీ గార్డుల నియామకాల్లో పెద్దఎత్తున అవినీతి చోటు చేసుకుందన్న ప్రచారం జోరుగా సాగుతోందని విమర్శించారు. కాంట్రాక్టర్‌కు సంబంధించి వ్యక్తులు మణుగూరులోనే తిష్ట వేసి లక్షల్లో వసూలు చేశారన్న ఆరోపణలు లేకపోలేదన్నారు. ఇటువంటి విషయాల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలను కట్టడి చేయాల్సిన బాధ్యత సింగరేణి యాజమాన్యంపై ఉందన్నారు. ప్రైవేటు సెక్యూరిటీ గార్డులుగా భూ నిర్వాసితులకు, ఉపాధి కోల్పోయిన ఆసుపత్రి వార్డు బాయ్‌లకు, పరుగు పందెంలో అర్హత సాధించిన నిరుద్యోగులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం నాగేశ్వరరావు, అంగోత్ మంగీలాల్, సాధనపల్లి రవి, విద్యాసాగర్, వెంకట్రావ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ ప్రగతికి విద్యార్థులే ఛోదక శక్తి

విద్యార్థులను మతోన్మాదులుగా చేస్తున్న పాలకులు

తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య

కొత్తగూడెం టౌన్, ఏప్రిల్ 27: దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే రూపుదిద్దుకుంటుందని, సమాజ ప్రగతికి విద్యార్థులే చోదక శక్తి అని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య అన్నారు. శనివారం పట్టణంలోని ఉర్దూఘర్ ఫంక్షన్ హాలులో ప్రగతిశీల ప్రజాసామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యు) సమావేశం ఆ సంఘం రాష్ట్ర సహాయక కార్యదర్శి ఏ.సాంబ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసత్యలను ప్రచారం చేస్తూ విద్యార్థులను మతోన్మాదులుగా తయారు చేస్తున్నారని ఆరోపించారు. సమాజ బాధ్యతల నుంచి విద్యాను పక్కదోవా పట్టిస్తు, సమాజ ప్రగతిని మూఢత్వంలోకి పంపిస్తున్నారని అన్నారు. పాలకులు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని ఆయన విద్యార్థులకు పిలుపునిచ్చారు. సమస్యలపై ఐక్యంగా పోరాడినప్పుడు అవి పరిష్కారమవుతాయన్నారు. పీడీఎస్‌యు జాతీయ కన్వీనర్ ఎం.రామకృష్ణ మాట్లాడుతూ పాలకులు విద్యను వ్యాపారమయం చేసి నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. 1966 సంవత్సరంలో ప్రొఫెసర్ కొఠారి కమిషన్ సిఫారసులను పాలక వర్గాలు పక్కన పెట్టాయన్నారు. ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసి అణగారిన వర్గాలకు విద్యను అందని ద్రాక్షలా మార్చారని తెలిపారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఆరెల్లి మురళీకృష్ణ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, పీడీఎస్‌యు మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నున్నా అప్పారావు, రాష్ట్ర కోశాధికారి వెంకట రెడ్డి, సతీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగయ్య